మజ్లిస్ గెలుపునకు కృషి చేయాలి: ఎమ్మెల్యే బలాల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మజ్లిస్ గెలుపునకు కృషి చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల కార్యకర్తలకు, నాయకులను కోరారు. అక్బర్‌బాగ్ డివిజన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మజ్లిస్ పార్టీ ముందుకు సాగుతుందన్నారు. హైదరాబాద్ పార్లమెంట్‌లో మజ్లిస్ పార్టీ జెండా ఎగురవేయడం తథ్యమన్నారు. కార్పొరేటర్ మినాజుద్దీన్, నాయకులు హఫీజ్ రహమతుల్లాహ తయ్యబ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సీపీఐ నుంచి 'వర్కర్స్ పార్టీ'లో చేరిక



వర్కర్స్ పార్టీలో చేరిన పూజారి శ్రీను

నాగోలు: ఎల్‌బీనగర్ సర్కిల్ సీపీఐ నాయకుడు పూజారి శ్రీను వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేశారు. ఆదివారం కొత్తపేటలో వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగా చారి సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పూజారి శ్రీను మాట్లాడుతూ.. గతంలో అఖిల భారత యువజన సమాఖ్య ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యదర్శిగా, సీపీఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యుడిగా ఉన్నానన్నారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఎన్నో ఉద్యమాలు చేశానన్నారు. గత 30 ఏళ్లుగా సీపీఐలో పని చేస్తున్న తనకు తగిన గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక, కర్షక రాజ్యాధికారం లక్ష్యంగా వర్కర్స్ పార్టీ పని చేస్తోందని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో వర్కర్స్ పార్టీ పోటీ చేయనుందని పాండురంగ చారి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కొప్పు యాదయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్వీ రాములు, కమిటీ సభ్యులు దెందే అయోధ్య పాల్గొన్నారు.

భూదాన్ బోర్డ్ మాజీ చైర్మన్‌పై విచారణ జరిపించాలి

తెలంగాణ సర్వోదయ మండలి డిమాండ్



సర్వోదయ మండలి మహాసభలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

సైదాబాద్: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంచే లక్ష్యంతో ఏర్పడిన భూదాన్ బోర్డును అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడిన బోర్డ్ మాజీ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డిపై ప్రభుత్వం సీబీఐచే విచారణ జరిపించాలని తెలంగాణ సర్వోదయా మండలి అధ్యక్షుడు శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని గిరిజన సమాఖ్య భవన్‌లో నిర్వహించిన సర్వోదయ మండలి హైదరాబాద్ మహాసభ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం సమావేశంలో సర్వోదయ మండలి హైదరాబాద్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలి హైదరాబాద్ అధ్యక్షుడిగా రూప్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా షేక్ గౌస్, ఉపాధ్యక్షుడిగా మునీరుద్దీన్, ప్రతినిధిగా షేక్ మహమూద్‌లు ఎన్నికైనారు. కార్యక్రమంలో రఘుపతి నాయక్, జంగయ్య, వివిధ ప్రాంతాల సభ్యులు పాల్గొన్నారు.

స్టీల్‌బ్రిడ్జి నిర్మాణంపై రేపు బీజేపీ నిరసన దీక్ష

సైదాబాద్: హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా చేపట్టిన సైదాబాద్ స్టీల్‌బ్రిడ్జి నిర్మాణానికి వ్యతిరేకంగా మంగళవారం నిరసన దీక్ష చేపట్టనున్నట్టు బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సైదాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మలక్‌పేట ఫైర్‌స్టేషన్ నుంచి సంతోష్‌నగర్ చౌరస్తా వరకు నిర్మిస్తున్న స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ ఆలయం పైనుంచి వెళ్లేలా ఎస్ఎన్‌డీపీ అధికారులు నిర్మిస్తున్నారని తెలిపారు. వైదిక ధర్మానికి వ్యతిరేకంగా నిర్మించనున్న ఈ నిర్మాణం ఎలైన్‌మెంట్‌ను మార్చాలని ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు ఎన్నిసార్లు ఎస్ఎన్‌డీపీ, జీహెచ్ఎంసీ అధికారులను కోరినా వారు స్పందించడం లేదన్నారు. భక్తుల మనోభావలకు వ్యతిరేకంగా సాగుతున్న నిర్మాణంపై బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. మంగళవారం ఉదయం హనుమాన్ ఆలయం వద్ద నిర్వహించే నిరసన దీక్షలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని దీక్షను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చిన్నారుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి



చంపాపేట: విద్యార్థి దశ నుంచే చిన్నారుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని రవీంద్రభారతి విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ రాణి అన్నారు. ఆదివారం చంపాపేటలోని రవీంద్రభారతి గ్లోబల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్నాతకోత్సవ వేడుకకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులచే ఎన్నికైన తరగతి ప్రతినిధులచే బ్యాడ్జీలు ధరింపచేశారు. ఈసందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన ఫోక్, వెస్టర్న్, శాస్త్రీయ నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల జోనల్ ఇన్‌చార్జి బాబూరావు, ప్రిన్సిపాల్ ఎ.కవిత, డీన్ దయాకర్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా కాకతీయ పాఠశాల వార్షికోత్సవం



లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని కాకతీయ కాలనీలోని కాకతీయ పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల డైరెక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ, మీ పిల్లలు మా బాధ్యత నినాదంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయం కేటాయించడంతో పాటు ఇంటిలో వారికి చక్కటి వాతావరణ కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు రమేష్ చంద్ర, శ్రద్ధా తదితరులు పాల్గొన్నారు.

పోలియో మహమ్మారిని తరిమికొడదాం

వాడవాడలా పల్స్‌పోలియో కార్యక్రమం

ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ బృందం: పల్స్ పోలియో కార్యక్రమం ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ల పరిధిలో ఆదివారం జోరుగా సాగింది. యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, బస్తీలు, కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ సంఘం భవనాలు, ఆలయాలు తదితర ప్రాంతాల్లో కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్లు, రాజకీయ పార్టీల నాయకులు, వైద్యులు పాల్గొని చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకు చిన్నారుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు. నిండైన జీవితం కోసం నవజాత శిశువుల నుంచి 5 సంవత్సరాల వయస్సు ఉన్న చిన్నారులందరికీ పోలియో చుక్కల మందు తప్పక వేయించాలని కోరారు.



కొత్తపేటలో ... కార్పొరేటర్ పవన్‌కుమార్



బీఎన్‌రెడ్డినగర్ టీచర్స్ కాలనీలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి



సిండికేట్ బ్యాంక్ కాలనీలో.. పాల్గొన్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి



సైదాబాద్ జయానగర్ దివ్యజ్యోతి ఫౌండేషన్‌లో..



నాగోలులో... కార్పొరేటర్ చింతల అరుణ



ఆర్కేపురంలో.. కాంగ్రెస్ నేత ఉపేందర్‌రెడ్డి



శాలివాహననగర్‌లో.. కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



ఎల్‌బీనగర్ సీఐ రామాంజనేయులును సన్మానిస్తున్న జోగు రాములు

నాగోలు: ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రామాంజనేయులను ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎస్సీ సెల్ చైర్మన్ జోగు రాములు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శాంతినికేతన్ మానసిక వికలాంగుల పాఠశాలలో ఆదివారం మదర్ థెరీస్సా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అనంతరం పండ్లను పంపిణీ చేసి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాఠశాలలోని వారికి వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చేవూరి శంకరయ్య, సభ్యులు భూతం సురేష్, తిరుమలేష్‌గౌడ్, చేవూరి సందీప్ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు చేయూత



పేద విద్యార్థుల ఫీజు కోసం నగదు అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి మిత్రబృందం

చైతన్యపురి: నలుగురు మిత్ర బృందం పేద విద్యార్థులకు స్కూల్ ఫీజులు అందజేశారు. చైతన్యపురి డివిజన్‌లోని ఆదర్శ ఫౌండేషన్‌లో ఉంటున్న అనాథ పిల్లలు స్కూల్ ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్నారని తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ డివిజన్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి తన మిత్రులు గంగాపురం ప్రసాదరెడ్డి, సంతోష్ గుప్తా, నరేందర్, సూర్యలతో కలిసి రూ. 45 వేలు వసతి గృహం ఇన్‌చార్జి జకియా ఫాతీమా, ప్రదీప్‌లకు అందజేశారు. పేద విద్యార్థుల చదువులకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో స్థానికులు కృష్ణ, సంతోష్‌యాదవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం మదర్సా అభివృద్ధికి కృషి చేస్తా



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: నాగారం మదర్సా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగారం గ్రామంలో గల మదర్సాలో విద్యార్థుల జల్సా దస్తర్ బండి అరేబియా నూర్ ఉల్ ఉలూమ్ కార్యక్రమానికి ఆదివారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే వాటిని సత్వరం పరిష్కరిస్తామన్నారు. అంతకు ముందు నాగార మదర్సా కమిటీ సభ్యులు, మైనార్టీ విద్యార్థులు అనితారెడ్డిని కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ మంచె పాండు యాదవ్, మాజీ సర్పంచ్‌లు లావణ్యలింగం, కావలి దశరథ, నాయకులు రాఘవేందర్ గౌడ్, సిద్దుల్‌గౌడ్, అన్వర్‌ఖాన్, అజాం, గౌస్‌ఖాన్, అంజద్‌ఖాన్, హాజీఖాన్, ఫిరోజ్ ఖాన్, షాభేర్, ఖాజా పాషా, బాబ్జానీ, హబీబ్, మదర్సా కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్టని దిగజార్చుతున్నారు



మాట్లాడుతున్న నరిసింహారెడ్డి

రామంతాపూర్: ఇందిరానగర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయకుండా కొంతమంది ఆలయ మాజీ ధర్మకర్తల పరిరక్షణ సమితి పేరిట గందరగోళం సృష్టిస్తున్నారని ఆలయ చైర్మన్ కోట్ల నరసింహారెడ్డి తెలిపారు. అంతేకాకుండా ఆలయ భూములను అన్యాక్రాంతం చేస్తున్నారని ఆరోపించారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయంలోని నాగదేవత, ఇతర విగ్రహాలతో పాటు ఒక శివలింగం శిథిలావస్థకు చేరాయని గుర్తుచేశారు. శివలింగం స్థానంలో గణేశ్ అనే భక్తుడు కాశీ నుంచి తెచ్చిన ఒక విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్టించామన్నారు. అయితే, ఈ విషయంపై పరిరక్షణ కమిటీ పేరిట కొంత మంది ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో బాబ్జి సంజీవ్‌గౌడ్, సతీశ్, రఘునాథ్‌గౌడ్, సాయి, శ్యామ్‌రావు, శివ తదితరులు పాల్గొన్నారు.

'అరోరా'లో సంప్రదాయ దినోత్సవం

రామంతాపూర్: గణేశ్‌నగర్‌లోని అరోరా అటానమస్ కళాశాలలో ఆదివారం అరోమా పేరిట సంప్రదాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్య నాటిక పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ.. సంప్రదాయ దినోత్సవ వేడుకల ద్వారా భిన్నత్వంలో ఏకత్వం అనే సందేశాన్ని సమాజానికి బలంగా వినిపించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సతీశ్‌కుమార్, దేవేందర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మహాశివరాత్రికి ప్రత్యేక బ్యాడ్మింటన్ టోర్నీ

హయత్‌నగర్: మహాశివరాత్రి పండుగ సందర్భంగా గజ్జి యాదయ్య, రాజమ్మయాదవ్ జ్ఞాపకార్థం ఈనెల 8వ తేదీ సాయంత్రం నుంచి 9వ తేదీ ఉదయం వరకు హయత్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ బ్యాడ్మింటన్ అకాడమీలో ప్రత్యేక షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గజ్జి నర్సింహయాదవ్ తెలిపారు. ఈ టోర్నీలో విజేతలకు లక్ష రూపాయల నగదు బహుమతులు ఇస్తామని, నగరంలోని నాన్ మెడలిస్టు క్రీడాకారులందరూ ఈ టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. మెన్స్ డబుల్, 45 ప్లస్ విభాగంలో పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తి గలవారు ఈ నెల 7 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు ఫోన్ నం. 9704541579లో సంప్రదించవచ్చన్నారు.

సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం



లింగోజిగూడ: సరూర్‌నగర్ నూతన ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డిని ఆదివారం లింగోజిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కందికంటి శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. నాయకులు షోకత్, షబ్బీర్, మున్నా, సుధీర్, నాగిరెడ్డి, సర్వర్ పాల్గొన్నారు.

సైదాబాద్‌లో నర్స్ అదృశ్యం

సైదాబాద్: ప్రైవేట్ ఆసుపత్రిలో నర్స్‌గా పని చేస్తున్న ఓ మహిళ కనిపించకుండా పోయింది. సైదాబాద్ పోలీసుల కథనం ప్రకారం ... సింగరేణి కాలనీలో నివసించే బి.రవి ప్రైవేట్ ఫార్మసీలో పని చేస్తున్నాడు. అతని భార్య లావణ్య(24) మూడేళ్లుగా నర్స్‌గా పని చేస్తోంది. శనివారం రాత్రి రవి విధులు ముగించుకొని ఇంటికి వచ్చే సరికి ఇంట్లో భార్య కనిపించలేదు. శనివారం హాస్పిటల్‌కు వెళ్లిన ఆమె విధులు ముగించుకొని ఇంటికి వచ్చి.. మళ్లీ బయటకు వెళ్లినట్లు తెలుస్తోంది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో భర్త రవి ఆదివారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిశుమందిర్‌లో విద్యార్థులకు పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, చేవేళ్ల, పరిగి తదితర జిల్లాలలోని శిశుమందిర్ పాఠశాలల విద్యార్థుల మధ్య భాగ్యనగర్ వైభవ్ పేరుతో కబడ్డీ, చెస్, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన జట్లకు, విద్యార్థులకు దివంగత పెద్దబావి పార్వతమ్మ జ్ఞాపకార్థం మెమొంటోలు, షీల్డులు అందజేశారు. పోటీల్లో 329 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విభాగ్ పౌర సంబంధాల ప్రముఖ్ పుష్పల వెంకటేశ్వర్‌రావు, పాఠశాల కార్యదర్శి దొడ్డి మల్లికార్జున్, విభాగ్ ఖేల్‌కూద్ ప్రముఖ్ ప్రేమ్‌కుమార్, విభాగ్ శైక్షిక్ ప్రముఖ్ కాసోజు భూషణ్, పెద్దబావి సమరసింహారెడ్డి, కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డి, సామ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

ఇబ్రహీంపట్నం రూరల్: గెలుపోటములను సమానంగా స్వీకరించాలని జెడ్పీటీసీ మహిపాల్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలో గత కొద్ది రోజులుగా పల్లె రజనీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదిబట్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. పోటీలో మహాత్మ యూత్ మొదటి బహుమతి సాధించి రూ.44,444 నగదు, ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు పల్లె గోపాల్‌గౌడ్, పల్లె బాల్‌రాజ్‌గౌడ్, ఆదిబట్ల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ శంకర్‌గౌడ్, సాయిబాబగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తులేకలాన్‌లో ఎంఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో టీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను జెడ్పీటీసీ మహిపాల్ ప్రారంభించారు. మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రమేష్, కరుణాకర్, సత్తు శశాంక్‌రెడ్డి, జగదీష్, శంకర్, శివ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాట 9, వంకాయ 23, బెండ 45, పచ్చి మిర్చి 50, కాకర 45, బీర 35, క్యాబేజీ 23, ఫ్రెంచి బీన్స్ 50, క్యారెట్ 21, దొండ 23–28, చిక్కుడు 23–50, గోకర 45, బీట్‌రూట్ 19, క్యాప్సికం 55, ఆలు 23, దోస 20, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 45. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

రైలు ఢీకొని యువకుడి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన నాంపల్లి జీఆర్పీ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోని లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..గుర్తు తెలియని యువకుడు (35) లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన ఓ గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మైదానంలో ఎల్ఈడీ దీపాల ఏర్పాటు

రామంతాపూర్: స్థానిక చిన్న చెరువు మైదానంలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని గత నెలలో 'సాక్షి'తో ప్రచురితమైన 'గంజాయి గ్యాంగ్' అనే కథనానికి కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు స్పందించారు. ఆమె చొరవ తీసుకుని శనివారం చెరువు ప్రాంగణంలో 32 ఎల్ఈడీ విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయించారు.

పొంచి ఉన్న ప్రమాదం

- జనావాసాల మధ్య డంప్‌యార్డ్‌లు
- భయాందోళనలో స్థానికులు
- కనీస జాగ్రత్తలు పాటించని నిర్వాహకులు

పహాడీషరీఫ్: జనావాసాల మధ్య అక్రమంగా కొనసాగిస్తున్న డంప్‌యార్డుల నుంచి వస్తున్న దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. డంప్‌యార్డులను మూసివేయాలని స్థానికులు పలుమార్లు నిర్వాహకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇది జల్‌పల్లి మున్సిపాలిటీలో కొనసాగుతున్న డంప్‌యార్డ్ పరిస్థితి. ఒకవైపు వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసనతో విషజ్వరాలు ప్రబలుతుండడం, మరోవైపు ఎప్పుడు ఎలాంటి అగ్ని ప్రమాదం సంభవిస్తుందో తెలియక స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి కాలం ప్రారంభం కావడం.. నిత్యం ఏదో ఒక చోట డంప్‌యార్డ్‌లలో అగ్ని ప్రమాదాలు జరుగుతుండడం చూసి స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జల్‌పల్లి కమాన్ రోడ్డు, శ్రీరాం కాలనీలలో సమస్య ఎక్కువగా ఉంది. అనధికార చెత్త పాయింట్ల వద్ద ప్లాస్టిక్, ఇతర విలువైన వ్యర్థాలను సేకరించి ఈ డంప్‌లలో పోగు చేస్తున్నారు. జనావాసాల నడుమ డంప్‌యార్డ్‌లను కొనసాగిస్తూ పెద్ద ఎత్తున చెత్త పోగు చేస్తుండడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది.



జల్‌పల్లిలో కొనసాగుతున్న పరిశ్రమలు



ఇటీవల శ్రీరాం కాలనీ ప్లాస్టిక్ గోదాంలో ఎగిసిపడిన మంటలు

అవగాహన రాహిత్యంతో నిల్వ ..

డంప్‌యార్డ్‌ల్లోని వ్యర్థాల్లో అనేక రకాల వస్తువులు ఉంటుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంటుంది. చెత్తలో లభ్యమయ్యే ఇనుప వస్తువులు, పేలుడు స్వభావం కలిగిన వస్తువులను కూడా నిర్వాహకులు అవగాహన రాహిత్యంతో నిల్వ ఉంచుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రమాదాలు జరిగితే తమ పరిస్థితి ఏమిటని బస్తీవాసులు ఆందోళన చెందుతున్నారు. వేసవి వచ్చిందంటే తరచూ ఏదో ఒక డంప్‌యార్డ్‌లలో అగ్నిప్రమాదం జరగడం పరిపాటిగా మారిందంటున్నారు. మార్చిలో జల్‌పల్లి కమాన్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో స్క్రాప్ గోడౌన్ పక్కనే ఉన్న డీసీఎంలు కూడా కాలిపోయాయి. ఈ నెల 2న శ్రీరాంకాలనీలో ఇళ్లనడుమ ఉన్న ప్లాస్టిక్ గోదాంలో మంటలు వ్యాపించాయన్నారు.

పర్యవేక్షణ అంతంతే..

మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ గోదాంలు, చెత్త డంప్‌లను వెంటనే తొలగించాలని యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు అధికారులకు పలుమార్లు విన్నవించారు. అప్పటికి స్పందిస్తున్న అధికారులు ఆ తర్వాత మిన్నకుండి పోతున్నారు. నిర్వాహకులు నాలుగైదు రోజులు తూతూ మంత్రంగా స్క్రాప్ గోడౌన్లను మూసి ఉంచి అనంతరం యథేచ్ఛగా తమ అక్రమ దందా కొనసాగిస్తున్నారు.